ప్రగతి తప్పుతోంది..

- పేరుకుపోయిన పన్ను బకాయిలు
- ప్రభుత్వ భవనాలకూ చెల్లించని వైనం
- 55 కార్యాలయాలకు నోటీసులు
- పట్టణంలో అభివృద్ధి పనులపై ప్రభావం

అమలాపురం టౌన్: పల్లెలైనా.. పట్టణాలైనా ప్రధాన ఆదాయ వనరులు పన్నులే.. ఆ సొమ్ము అభివృద్ధికి ఊతమవుతోంది.. ప్రజలు పన్నులు కట్టకపోతే ముక్కుపిండి వసూలు చేస్తారు.. అదే ప్రభుత్వ భవనాలైతే ఎవరికి చెప్పాలి.. ఏం చేయాలనే సందిగ్ధం ఉత్పన్నమవుతోంది. అమలాపురం మున్సిపాలిటీలో పరిస్థితి ఇది. ఇక్కడి 55 ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు కొన్నేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించడం లేదు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల అధికారులు ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నా ప్రయోజనం లేక చేతులెత్తేస్తున్నారు. ఈ కార్యాలయ భవనాల పన్ను బకాయిల గురించి ఆయా అధికారులను మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం పదేపదే అడుగుతున్నా ప్రయోజనం ఉండడం లేదు. పట్టణంలో ప్రధాన తపాలా కార్యాలయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 54 కార్యాలయ భవనాలు ఉన్నాయి. వీటి ద్వారా ఆస్తి పన్ను రూపేణా మున్సిపాలిటీకి అసలు రూ.1.87 కోట్లు కాగా వడ్డీతో కలుపుకొని రూ.6 కోట్ల వరకూ బకాయిలు పేరుకుపోయాయి. ఇది అటు మున్సిపాలిటీకి, ఇటు ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు గుదిబండలా మారాయి. మున్సిపాలిటీకి అత్యధికంగా పన్ను బకాయి అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయ భవనం పడింది. ఈ భవనానికి అసలు సుమారు రూ.20 లక్షలు, వడ్డీతో కలుపుకొని దాదాపు రూ.80 లక్షలకు చేరుకుంది. మొదటి స్థానంలో ఈ ప్రధాన తపాలా కార్యాలయం ఉంటే, రెండో స్థానంలో అమలాపురం బాలయోగి వుమెన్ ఎంపవర్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌కు చెందిన భవనాలు (నాలుగు చోట్ల) దాదాపు రూ.98 లక్షలతో ఉంది. మూడో స్థానంలో అమలాపురం పోలీస్ క్వార్టర్స్ రూ. 64 లక్షలు చెల్లించాల్సి ఉంది.



రూ. 80 లక్షల మేర ఆస్తి పన్ను బకాయి పడిన అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయ భవనం

బకాయిల భారంపై కలెక్టర్‌కు నివేదిక

మున్సిపాలిటీకి పట్టణంలోని ఒక కేంద్ర ప్రభుత్వ భవనం, 54 రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు ఆస్తి పన్ను రూ.6 కోట్ల మేర పేరుకుపోవడంతో కొన్ని నెలల కిందటే బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత పన్ను భారం ఉంటే మున్సిపాలిటీ పాలన ఎలా సాగుతుందని ఆయన మున్సిపల్ రెవెన్యూ విభాగం వద్ద అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను పరిష్కరించే దిశగా ఆయన చేసిన ప్రయత్నాల్లో మొదటిది జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు బకాయి జాబితాను ఓ నివేదిక రూపంలో అందించారు. జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ బకాయిలపై త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. రెవెన్యూ సిబ్బందితో పాటు కలెక్టర్ కూడా ప్రభుత్వ కార్యాలయాలకు స్వయంగా వెళ్లి బకాయి పన్నులను వసూలు చేయాలనుకుంటున్నారు.

ఇప్పటికే నోటీసులు ఇచ్చాం



పన్ను బకాయిలు పేరుకుపోయిన ప్రభుత్వ కార్యాలయాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. త్వరలోనే ఆయా కార్యాలయాలకు రెవెన్యూ సిబ్బంది ప్రత్యక్షంగా వెళ్లి పన్నుల చెల్లింపు కోసం అడుగుతాం. దీనికోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించాం. దాదాపు రూ.6 కోట్ల మేర ప్రభుత్వ కార్యాలయ భవనాల నుంచి పన్నులు నిలిచిపోవడంతో మున్సిపాలిటీ నిర్వహణ భారంగా మారింది.

– భూపతి శ్రీలక్ష్మి, రెవెన్యూ అధికారి, అమలాపురం మున్సిపాలిటీ

అధిక బకాయి పడిన భవనాలు

ప్రధాన తపాలా కార్యాలయం భవనానికి రూ. 80 లక్షలు, పోలీస్ క్వార్టర్స్‌కు రూ. 64 లక్షలు, వుమెన్ ఎంపవర్‌మెంట్ ట్రైనింగ్ భవనాలకు రూ. 98 లక్షలు, అంబేడ్కర్ కమ్యూనిటీ హాలుకు రూ.28 లక్షలు, ఆర్డీఓ కార్యాలయం రూ.36 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం రూ.29 లక్షలు, జిల్లా పరిషత్ అతిథి గృహం రూ.20 లక్షలు, గవర్నమెంట్ బీసీ గరల్స్ హాస్టల్ రూ.11 లక్షలు, జెడ్పీ హైస్కూల్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ రూ.12 లక్షలు, పీఆర్ కార్యనిర్వహణ ఇంజినీర్ కార్యాలయం రూ.14 లక్షల చొప్పున పన్నులు చెల్లించాలి.

పోస్టుల్లో అన్యాయంపై ఎల్జీకి వినతిపత్రం

యానాం: పుదుచ్చేరి విద్యుత్ శాఖలో 177 కన్‌స్ట్రక్షన్ హెల్పర్ పోస్టుల భర్తీకి ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌లో యానాం రీజియన్‌కు కేవలం మూడు పోస్టులు కేటాయించడంపై న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాషనాథన్‌కు వినతిపత్రం పంపినట్లు మాజీ ఎమ్మెల్యే వెలగా రాజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ చాలా అన్యాయంగా ఉందని, దీంతో అన్ని వర్గాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. మొత్తం పోస్టుల్లో జనరల్ కేటగిరీలో 79 పోస్టులకు పోటీ పడటానికి అనుమతించకపోవడం అన్యాయమన్నారు. 40 శాతం పోస్టులు ఓపెన్ జనరల్ కేటగిరీకి కేటాయించాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, మాజీ సైనికులు, పీహెచ్, ఎంఎస్ఎమ్ కేటగిరీలకు సైతం పోస్టులు కేటాయించలేదన్నారు. అదేవిధంగా మొత్తం పోస్టులను రీజియన్ల వారీగా జనాభా ప్రాతిపదికన విడగొట్టడం వల్లే యానాం రీజియన్‌కు కేవలం 3 పోస్టులు వచ్చాయన్నారు. ఈ సమస్యపై స్పందించి యానాం నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

న్యాయం చేయాలంటూ..

పుదుచ్చేరి విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న కన్‌స్ట్రక్షన్ హెల్పర్ పోస్టులకు ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో 177 పోస్టులకు గాను యానాం రీజియన్‌కు కేవలం 3 పోస్టులే కేటాయించడంతో తాము నష్టపోతున్నామంటూ ఆదివారం పలువురు యానాంకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు ఎల్జీ కె.కైలాషనాథన్‌కు, పుదుచ్చేరి సీఎం రంగసామికి వినతి పత్రాలను పంపారు. అదేవిధంగా పుదుచ్చేరి వెళ్లి చీఫ్ సెక్రటరీ, ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్, ప్రాంతీయ పరిపాలనాధికారికి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు శ్రీకారం



గొల్లవిల్లిలో దసరా ఉత్సవాలకు పందిరి రాట వేసిన గ్రామస్తులు, విద్యుత్ శాఖ సిబ్బంది

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి గ్రామంలో విజయ కనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో జరిగే దసరా ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద స్థానిక పెద్దలు, విద్యుత్ శాఖ సిబ్బంది పందిరి రాటను వేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీహరి, సిబ్బంది టి.విజయ్‌కుమార్, బి.వెంకటేశ్వరరావు, పి.సురేష్, విజయ్, సలాది శ్రీనువాసరావు, పరిమి రాధాకృష్ణ, గ్రామ పెద్దలు జొన్నాడ చిన్ని, మారిశెట్టి పుండరీకాక్షుడు, మద్దింశెట్టి సీతారామస్వామి, సుంకర బుజ్జి, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: దసరా ఉత్సవాలకు ఆదివారం పలు ఆలయాల వద్ద పందిరిరాట ముహూర్తం చేశారు. తాళ్లరేవు ప్రధాన రహదారి చెంతన పరదేశమ్మ వీధిలో కనకదుర్గమ్మ ఆలయం, నీలపల్లి చెక్‌పోస్ట్ సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయం వద్ద పందిరిరాట ముహూర్తాలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం



స్వామివారి చిత్రపటాన్ని దాతలకు అందిస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీవీరేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన ట్రస్ట్‌కు సికింద్రాబాద్‌కు చెందిన వీవీజే నాగేంద్రరావు ఆదివారం రూ.10,116 విరాళంగా అందించారు. దాతకు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం జరిపించి, స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించారు. దాతల కుటుంబ సభ్యులను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ అభినందించారు.

వెంకన్న సన్నిధిలో అన్న సమారాధన



వెంకన్న ఆలయం వద్ద అన్న సమారాధనలో భక్తులు

యానాం: స్థానిక శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం అన్నసమారాధన జరిగింది. దాతల సహకారంతో ఇకపై ప్రతి శనివారం భక్తులకు అన్నదానం చేయడానికి నిర్ణయించినట్లు ఆలయ అర్చకుడు పెద్దింటి రఘురామ వినోదాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్త కాపగంటి జయబాబు, కుమారుల ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో సుమారు 200 మంది పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఇప్పటికే వచ్చే ఏడాది ఏప్రిల్ 11 వరకు అన్నదానం చేసేందుకు దాతలు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్ కాపగంటి ఉమాశంకర్, పైడికొండల వీరాస్వామి, సహదేవరాజు, ఉంగరాల వెంకటేశ్వరరావు, సీఎస్ఆర్ కృష్ణమూర్తి, పివి హనుమంతరావు, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

సుంకరపాలెంలో..

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామంలోని వర్తకుల వీధిలో కొలువైన శ్రీలక్ష్మీగణపతి స్వామివారి ఆలయం వద్ద ఆదివారం అన్న సమారాధన జరిగింది. 74వ గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని శ్రీలక్ష్మీగణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐదు వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు చేశారు. యూత్ సభ్యులు అందరూ సనాతన ధర్మ సేవాసంఘం టీషర్టులు ధరించి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నరహరిశెట్టి వీరబాబు, నందికోళ్ల సతీష్, పెద్దిరెడ్డి విఘ్నేశ్వరరావు, మోపూరి శ్రీనివాస కిరణ్, తోట రాజు, కాటంశెట్టి రామ్మూర్తి, మాగాపు శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారావు, తోట తాతీలు, నరహరిశెట్టి శ్రీనివాసరావు సేవలందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

అమలాపురం టౌన్: స్థానిక కిమ్స్ వైద్య కళాశాలలో మూడో సంవత్సరం వైద్య విద్య అభ్యసిస్తున్న ఓ విద్యార్థి ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురై అకస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానిక ఎర్ర వంతెన రోడ్డులో స్కూటీపై వైద్య విద్యార్థి తరుణ్‌కృష్ణ వెళుతుండగా వెనుక నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్న స్థానిక కరక్కాయ పేటకు చెందిన కొనాల సుజిత్ ఢీకొన్నాడు. తరుణ్‌కృష్ణ తలకు గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతను కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడని పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు తెలిపారు. సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విజయవాడకు తరలివెళ్లిన న్యాయవాదులు



విజయవాడ బయలుదేరిన న్యాయవాదులు

అమలాపురం టౌన్: విజయవాడలో స్వామీజీల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన హిందూ ధర్మ సమ్మేళనానికి అమలాపురం బార్ అసోసియేషన్‌చే న్యాయవాదులు ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు. అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 69 మంది న్యాయవాదులు విజయవాడ వెళ్లారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ విజయవాడలో హిందూ ధర్మ సమ్మేళనంలో హిందూ చట్టంపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. ముఖ్యంగా క్రిస్టియన్, మైనార్టీ ఆస్తుల పరిరక్షణ, హిందూ దేవాలయాల ఆస్తుల రక్షణ వంటి పలు అంశాలపై స్వామీజీలు విపులంగా చర్చించారని తెలిపారు. విజయవాడకు వెళ్లిన వారిలో సీనియర్ న్యాయవాదులు నల్లా ప్రభాకర్, యార్లగడ్డ రవీంద్ర, మట్టపర్తి మురళీకృష్ణ, నడింపల్లి సీతారామరాజు, నందెపు శ్రీవెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మావుళ్లకు ప్రత్యేక పూజలు



కాట్రేనికోనలో సినీ నటుడు సురేష్‌శర్మను సన్మానిస్తున్న గ్రామస్తులు

కాట్రేనికోన: మిరాయి సినిమా విజయవంతం కావడంతో ఆదివారం కాట్రేనికోన మావుళ్లమ్మ ఆలయంలో సినీ నటుడు పుష్ప సురేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో భజనలు, నాటకాలు చేసే తనకు పుష్ప సినిమా సినీ రంగంలో మంచి గుర్తింపు తీసుకొస్తే, మిరాయి చిత్రం మరింత పేరును తెచ్చిందని సురేష్‌శర్మ అన్నారు. కాట్రేనికోనకు చెందిన తాను 200కు పైగా టీవీ సీరియల్స్, 150 చిత్రాల్లో నటించే అవకాశం దొరకడం మావుళ్లమ్మ ఆశీస్సులే కారణమన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆకివిళ్ల ఫణికాంత్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. అనంతరం సురేష్‌శర్మను స్థానికులు సత్కరించారు. కార్యక్రమంలో కంచు స్థంభం సోనీ, తాతపూడి గోపి, మంత్రిప్రగడ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

ఐ.పోలవరం: మురమళ్ల నుంచి గుత్తెనదీవి వెళ్లే ప్రధాన పంట కాలువ పలుచోట్ల ఆక్రమణలకు గురై దిగువ ప్రాంతాలకు సాగునీరు అందడం లేదని, తక్షణం వాటిని తొలగించాలని మండలానికి చెందిన రైతులు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు ఆదివారం వినతి పత్రాన్ని అందించారు. ప్రధాన పంట కాలువను ఆక్రమించి వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయడంతో పాటు వాటి నుంచి వచ్చే వ్యర్థాలు పడవేయడంతో అవి మేటలుగా మారుతున్నాయన్నారు. ఫలితంగా దిగువన ఉన్న మురమళ్ల, కొమరగిరి, ఎదుర్లంక, పాత ఇంజరం, జి.మూలపొలం, గుత్తెనదీవి తదితర గ్రామాల పంట భూములకు సాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

18 ఏళ్లలోపు యువతకు మద్యం అమ్మకాలు నిషేధం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా 18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న యువతకు మద్యం అమ్మకాలను నిషేధిస్తున్నట్లు ఆదివారం పుదుచ్చేరి ఎక్సైజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అన్ని మద్యం, పొగాకు దుకాణాలు, దేశంలో తయారయ్యే విదేశీ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లకు ఉత్తర్వులను పంపింది. 18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారు బార్లలోకి వస్తున్నట్లు, ఆ విధంగా అమ్మకాలు సాగుతున్నట్లు పలు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పుదుచ్చేరి ఎక్సైజ్ చట్టం 1970లో సెక్షన్ 196 (సి) ప్రకారం ఉత్తర్వులు ఇచ్చారు. దీనిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు



పి.లక్ష్మీవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న కాట్రేనికోన ఎస్సై అవినాష్

కాట్రేనికోన: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కాట్రేనికోన ఎస్సై అవినాష్ సూచించారు. పి.లక్ష్మీవాడ గ్రామంలో ఆదివారం కాట్రేనికోన ఎస్సై అవినాష్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు తాగడం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులపై ఒక్క కేసు నమోదైనా వారి జీవితం నాశనమవుతుందని అన్నారు. మత్తులోనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం పి.లక్ష్మీవాడ, పెనుమల్లే గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.

ఉప్పలగుప్తం: గ్రామాల్లో జన జాగృతి చైతన్య రథం ద్వారా చట్టాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ఎన్. కొత్తపల్లి, గొల్లవిల్లి సెంటర్లలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏఎస్ఐ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కరాటే పోటీలు

అమలాపురం రూరల్: పవర్ కిక్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు అమలాపురం మండలం పేరూరు బీఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. దీనికి యునైటెడ్ షోటోకాన్ కరాటే చీఫ్ హైదర్ అలీ అధ్యక్షత వహించారు. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 950 మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారని చీఫ్ ఆర్గనైజర్ పడాల అంజి తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. విజేతలకు ఎంపీ గంటి హరీష్ మాధుర్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మెట్ల రమణబాబు పతకాలు అందించారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చిక్కం సురేష్, రిఫరీ ఎ.రవి పాల్గొన్నారు.

నాటు తుపాకీ స్వాధీనం

అల్లవరం: మండలంలోని దేవగుప్తంలో ఓ ఆక్వారైతు రొయ్యల చెరువుల వద్ద నాటు తుపాకీతో పిట్టలను కాల్చుతున్న వ్యక్తిని అల్లవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి చెరువుల వద్ద నాటు తుపాకీ శబ్దాలు రావడంతో స్థానికులు గుర్తించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిపై అల్లవరం పోలీసులు స్పందించి రొయ్యల చెరువుల వద్ద పిట్టలను కాలుస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. నాటు తుపాకీ లేదా చెక్క తుపాకీనా అనే దానిపై విచారణ చేస్తున్నామని ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు.

రామదాసు జీవితం స్ఫూర్తిదాయకం

అమలాపురం రూరల్: అధ్యాపక వృత్తి ద్వారా వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దిన దివంగత నిష్టల రామదాసు జీవితం స్ఫూర్తిదాయకమని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నూజిళ్ల శ్రీనివాస్ అన్నారు. అమలాపురం ఈదరపల్లి జనహిత కార్యాలయంలో ఏబీవీపీ జిల్లా శాఖ, ఏబీవీపీ పూర్వపు రాష్ట్ర అధ్యక్షుడు ఆంజని శ్రీనివాస్ అధ్యక్షతన దివంగత నిష్టల రామదాసు స్మారక ఆదర్శ ఉపాధ్యాయ పురస్కారం–2025 ప్రదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రామదాసు ఎస్‌కేబీఆర్ కళాశాల అధ్యాపకుడిగా విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ బాధ్యతలను సమర్థంగా నిర్వహించారన్నారు. మరో అతిథి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ జిల్లా సహ సంఘ్ చాలక్, ప్రముఖ న్యాయవాది మైలవరపు రవిరాం, పూర్వపు రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆంజని శ్రీనివాస్ మాట్లాడుతూ రామదాసు ఎంతో విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు. ఉపాధ్యాయులు నరసింహారావు, సూర్యనారాయణ, శ్రీరామ్, లక్ష్మీనరసమ్మ, పద్మావతి, పల్లాలమ్మ దేవి, రామకృష్ణ, మురళీధర్, గుణరంజన్ సూర్యనారాయణమూర్తి, ఎ.రామకృష్ణలకు నిష్టల రామదాసు స్మారక ఆదర్శ ఉపాధ్యాయ -2025 పురస్కారాలను అందించారు. జిల్లా వ్యవస్థా ప్రముఖ్ బి.రామప్రసాద్, ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్‌వర్మ, అభి, కేశవ్, కె.గంగాధర్, ఆర్ఎస్ఎస్ నాయకులు బి.జగదీష్, దొంగ మోహన్, పార్థసారథి, నండూరి శ్రీరామ్, సంస్కార భారతి రాష్ట్ర మహిళా ప్రముఖ్ సాయిలక్ష్మి కళాపూర్ణారావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

రాజకీయ పార్టీ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోలేదు

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం: కొత్తగా రాజకీయ పార్టీ ఏర్పాటుపై తాను ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, అలాంటిది ఉంటే సరైన సమయంలో ప్రజల అభిప్రాయం మేరకే తన నిర్ణయం ఉంటుందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం తన స్వగృహంలో అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీపై వస్తున్న ఊహాగానాలపై స్పష్టతనిస్తూ ప్రజాభీష్టం మేరకే తాను నడుచుకుంటానన్నారు. అదేవిధంగా నవంబర్ 21కి తన రాజకీయ ప్రస్థానం 26 ఏళ్లు పూర్తవుతుందని, ఆ విధంగా పలు కార్యక్రమాలు చేస్తామన్నారు. సమావేశంలో ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, గూటం శివగణేష్, బంగారం, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

వైభవంగా మరిడమ్మ తీర్థ మహోత్సవం



మరిడమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామ దేవత మరిడమ్మ వారి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు కందికొండ వెంకట కృష్ణయ్య, భాస్కర శర్మ తదితరుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని గరగ నృత్యాలు, తప్పెట గుళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపుగా ప్రధాన ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ టేకుమూడి లక్ష్మణరావు, సెక్రటరీ సంగాడి వీరప్రసాదరావు, వైస్ చైర్మన్ పెమ్మాడ కాశీవిశ్వనాథం, సహాయ కార్యదర్శి దడాల భైరవస్వామి, కందికొండ భాస్కరశర్మ, సమనస వీరభద్రరావు, మందా సుబ్రహ్మణ్యం, కాద నాగేశ్వరరావు, అత్తిలి బాబూరావు పాల్గొన్నారు.



సీతారామపురంలో మరిడమ్మవారు